ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులే గేమ్‌చేంజర్లు

- పర్యావరణహిత సుస్థిర అభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేయాలి
- ఢిల్లీలో యునెస్కో పర్యావరణ సదస్సులో మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ప్రకృతి పరిరక్షణలో పాఠశాల, కాలేజీ విద్యార్థులను గేమ్ చేంజర్లుగా తీర్చిదిద్దాలని గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. పర్యావరణహిత సుస్థిర అభివృద్ధిలో విద్యార్థులను మరింతగా భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం 'సుస్థిర పర్యావరణం- విద్యార్థుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఢిల్లీ ఇండియా హాబిటాట్ సెంటర్‌లో (రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టెయినబిలిటీ ఎడ్యుకేషన్-ఐసీఎస్‌ఈ) యునెస్కో పర్యావరణ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ఇతర ప్రముఖుల తోపాటు కేంద్ర అడవులు, పర్యావరణ శాఖ మాజీ సెక్రటరీ ప్రవీణ్ గారె, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పద్మశ్రీ కార్తికేయ సారాభాయ్, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ జాదవ్ పాయెంగ్, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ పాల్గొని ప్రసంగించారు. అడవులను కాపాడటం, నీటి వనరుల రక్షణ ప్రస్తుతం సమాజం ముందున్న అతిపెద్ద సవాల్ అని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులకు ఈ విషయాలపై తగిన అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయి పర్యటనతో కూడిన బోధనా విద్య ఉండాలని సూచించారు. పర్యావరణ విద్యలో క్షేత్రస్థాయిలో పరిశీలన, విద్యార్థులకు అవగాహన కూడా అత్యంత ముఖ్యమైన విషయమని అభిప్రాయపడ్డారు.

అరావళిలో మొక్కనాటిన సంతోష్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని వసంత్‌విహార్ సమీపంలోని అరావళి ఫారెస్టును మాజీ ఎంపీ, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ సంతోష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా అక్కడ అరావళి టీం సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. 2004కు పూర్వం అరావళి ఫారెస్ట్ అంతటా డంపింగ్ యార్డ్, మైనింగ్ జరుగుతూ ఉండేది. మైనింగ్ నుంచి రక్షించాలని స్థానిక ప్రజలు కోర్టుకు వెళ్లడంతో ఫారెస్ట్‌ను రక్షించాలని కోర్టు ఆదేశించింది. దాంతో ఢిల్లీ సర్కార్ పార్క్ అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించింది. ప్రొఫెసర్లు హుస్సేన్, దిశాంత్, అరావళి టీం 700 ఎకరాల్లో అడవిని సంరక్షించి, సుందరంగా తయారుచేశారు. ఈ అడవిలో ప్రస్తుతం 150 రకాల సీతాకోకచిలకల జాతులు, 120 రకాల పక్షులు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి గుంతలను ఇంకుడు గుంతలుగా మార్చడంతో భూగర్భ జలాలు సైతం పెరిగాయి.

విద్యార్థులకు అవార్డులు అందజేసిన సంతోష్

గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ వివరించారు. ప్రకృతి పునరుద్ధరణలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటడం, సమాజంలో ప్రభావిత వ్యక్తులను భాగస్వాములను చేయడం లాంటి కార్యక్రమాలను గత ఏడేండ్లుగా చేపడుతున్నట్టు వెల్లడించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ స్ఫూర్తిని సమావేశంలో పాల్గొన్న వక్తలు అభినందించారు. వివిధ స్కూళ్లలో విద్యనభ్యసిస్తూ పర్యావరణ పరిరక్షణపరంగా ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు సంతోష్‌కుమార్ చేతులమీదుగా నిర్వాహకులు అవార్డులను అందజేశారు. రానున్న రోజుల్లో పర్యావరణపరంగా మానవాళికి పొంచి ఉన్న ముప్పును ఇప్పటి నుంచే విద్యార్థులకు తెలియజేసి, ప్రకృతి పట్ల తగిన బాధ్యతతో ప్రవర్తించాల్సిన తీరును వారికి నేర్పాల్సిన అవసరం ఉన్నదని క్లైమేట్ రియాలిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఇండియా, సౌత్ ఆసియా) డాక్టర్ ఆదిత్య పండిట్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులు తద్వారా ఎదుర్కోబోయే సమస్యల పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలిగించేలా సిలబస్‌లో మార్పులతోపాటు తరగతి గదుల్లో కూడా ఆ విధమైన విద్య అభ్యసించేలా ఉండాలని అందుకు తగిన మార్పుచేర్పులను కేంద్రం చేపట్టాలని నిపుణులు సూచించారు. పర్యావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్‌పై అధ్యయనం చేస్తున్న వివిధ దేశాల శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ప్యానెల్ చర్చల్లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో రీతురాజ్ పుకాన్, గ్రీన్ ఇండియా చాలెంజ్ సమన్వయకర్తలు కరుణాకర్‌రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అరావళి ఫారెస్టులో మొక్కను నాటుతున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

పర్యవరణ ఉద్యమంలో భాగమవడం గర్వంగా ఉన్నది: సంతోష్

యునెస్కో సదస్సులో భారతదేశపు ప్రముఖ పర్యావరణ పరిరక్షకులు, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ జాదవ్ పాయెంగ్‌తో కలిసి వేదిక పంచుకోవడం గర్వంగా ఉన్నదని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ తెలిపారు. పర్యావరణాన్ని పెంపొందించడంలో, స్థిరత్వం కోసం విద్యను ప్రోత్సహించే యంగ్ ఇన్నోవేటర్స్ నడిపించే అద్భుతమైన ఎకో-ప్రాజెక్టులను ప్రత్యక్షంగా చూడటం గొప్ప అనుభూతి కలిగించిందని పేర్కొన్నారు. మనందరి భవిష్యత్‌ను పచ్చగా, ప్రకాశవంతంగా మారుస్తున్న ఈ ఉద్యమంలో భాగమవడం మరింత గర్వంగా ఉన్నదని ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తంచేశారు.

ర్యాలీలో పాల్గొన్న ఆర్ కృష్ణయ్య

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ముషీరాబాద్, సెప్టెంబర్ 20 : స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యానగర్, ఉస్మానియా యూనివర్సిటీ, శంకర్‌మఠ్ వరకు వేలాది మందితో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఎన్నికల వాగ్దానాలు అమలుచేయడం లేదని, బీసీ రిజర్వేషన్లు పెంచకుండా కాలాయాపన చేస్తుందని అరోపించారు. ఫీజు బకాయిలు రూ.4,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని, 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని, కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేముల రామకృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేశ్, అంజి, అనంతయ్య పాల్గొన్నారు.

త్వరలో మద్యం ధరల పెంపు?

- పెరిగిన ధరల్లో ప్రధాన వాటా కంపెనీలకే
- సర్కారు ఖజానాను కొల్లగొట్టేందుకు భారీ కుట్ర
- తెలుగు రాష్ట్రాల్లో ఒకే తీరు ధరలకు కసరత్తు
- చక్రం తిప్పుతున్న పారుగు రాష్ట్రపు అనుంగుడు
- అస్మదీయులకే మద్యం సరఫరా కాంట్రాక్టులు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య లిక్కర్ బంధం మంచి కిక్కుమీదున్నట్టు తెలుస్తున్నది. అస్మదీయ డిస్టిలరీలకు, బ్రూవరీలకు, సప్లయ్ కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెట్టే దగ్గర నుంచి, చట్టానికి, వైరిపక్షానికి దొరకకుండా ఖజానాను కొల్లగొట్టే మార్గాల అన్వేషణ వరకు అన్ని నిర్ణయాలు కూడబలుక్కొనే జరుగుతున్నట్టు సమాచారం. మొత్తంగా మద్యం ధరలను పెంచేసి.. ఆ పెంచిన మొత్తంలో సింహభాగం మద్యం కంపెనీలకే దక్కేలా విధానాలు రూపొందిస్తున్నట్టు తెలుస్తున్నది. పొరుగు రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విధానానికి తుదిరూపునిస్తున్నారు. అది పూర్తవగానే.. దానికి తగ్గట్టుగా తెలంగాణలో మద్యం ధరలు పెంచేందుకు ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తున్నది. మరో పక్షం రోజుల్లో ప్రతి క్వార్టర్ లిక్కర్ ధరను కనిష్ఠంగా రూ.10 నుంచి గరిష్ఠంగా రూ.160 వరకు పెంచే అవకాశం ఉంది.

ధరలు పెంచాలని కోరుతున్న కంపెనీలు

తమకు చెల్లించే బేసిక్ ధరలు పెంచాలని డిస్టిలరీలు, బ్రూవరీలు, లిక్కర్ సరఫరా కంపెనీలు ఎప్పటినుంచో కోరుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో రెండేండ్లకోసారి మద్యం ధరలను పెంచుతుండగా, తెలంగాణలో గత కొన్నేండ్లుగా పెంచలేదనేది మద్యం కంపెనీల వాదన. మద్యం కంపెనీలకు కోరిన ధర చెల్లించటం ఆషామాషీ వ్యవహారం కాదు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా కాగ్ (కంట్రోలర్ అండ్ అడిటర్ జనరల్) తప్పు పడుతుంది. న్యాయస్థానాల్లో కేసులు పడతాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా వ్యవహరించింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం ధరలు పెంచటానికే మొగ్గు చూపుతున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. మద్యం కంపెనీలు సిండికేటుగా ఏర్పడి పొరుగు రాష్ట్రం నుంచి వ్యవహారం నడిపిస్తున్నట్టు నమ్మకమైన సమాచారం అందింది. అక్కడి అగ్రనేత కనుసన్నల్లోనే తెలంగాణ బ్రూవరేజస్ కార్పొరేషన్ (టీజీబీసీఎల్)లో వ్యవహారాలు సాగుతున్నట్టు తెలిసింది.

ధరల కమిటీలో అనుచరుడు

తెలంగాణలో మద్యం ధరలను నిర్ణయించటానికి టీజీబీసీఎల్ ఏర్పాటుచేసిన కమిటీలో అనూహ్యంగా పొరుగు రాష్ట్రం అగ్రనేతకు అనుంగునిగా ముద్ర ఉన్న రిటైర్డ్ బ్యూరోక్రాట్‌ను సభ్యునిగా చేర్చారు. తెలంగాణ ప్రభుత్వం అతడిని కీలక హోదాలో నామినేట్ చేసింది. తాజాగా ఆయనకే మద్యం ధరలను నిర్ణయించే బాధ్యతలు అప్పగించారు. జూలై 18న సమావేశమైన ఈ కమిటీ.. మద్యం కంపెనీలు తమ డిమాండ్ ధరలను కోట్ చేస్తూ సీల్డ్ కవర్ ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో 91 కంపెనీలు మద్యం సప్లయ్ చేయటానికి ముందుకు వచ్చాయి. మొత్తం 1032 బ్రాండ్లకు ధర కోట్ చేశాయి. ఇందులో 755 బ్రాండ్లు పాతవే కాగా, మరో 277 కొత్త బ్రాండ్లకు టెండర్లు పడ్డాయి. కొత్త వాటిలో సోం డిస్టిలరీతో పాటు కర్ణాటక, గోవా, మహారాష్ట్రకు చెందిన డిస్టిలరీలు, 20 వరకు హైదరాబాద్‌లోనే రిజిస్ట్రేషన్ చేసుకున్న లోకల్ కంపెనీలు ఉన్నాయి. వివాదాస్పద సోం డిస్టిలరీకి తొలుత అనుమతినిచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ తర్వాత ప్రతిపక్షాల విమర్శలతో వెనక్కి తగ్గి అనుమతిని తాత్కాలికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ఏపీలో ధరలు మనకన్నా ఎక్కువే

ప్రస్తుతం ఏపీలో మద్యం ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అక్కడ ఎంత తగ్గించినా అది చీప్ లిక్కర్‌కే వర్తిస్తుంది. అక్కడి ధరలకు సమీపంగా ఉండేటట్టు తెలంగాణలో మద్యం ధరలను సవరించనున్నట్టు తెలిసింది. ఆ మేరకు పెంచే ధరల్లో సింహభాగం మద్యం కంపెనీలకే చెల్లించే విధంగా కసరత్తు జరుగుతున్నది. రెండు పక్కపక్క రాష్ట్రాల మద్యం ధరలు, డిస్టిరీలకు చెల్లింపులు, సుంకాలు ఒకే తరహాలో ఉంటే న్యాయపరమైన ఇబ్బందులు ఉండవు. కాగ్ కూడా పొరుగు రాష్ట్రాల ఎమ్మార్పీ, బేసిక్ ధరలను సరిపోల్చి నివేదికలు రూపొందిస్తుంది. వచ్చే నెల మొదటి వారంలో పొరుగు రాష్ట్రం నూతన పాలసీ వెలువడే అవకాశం ఉంది. ఆ తరువాతనే తెలంగాణ ధరల నిర్ణయ కమిటీ అక్టోబర్ నెలా ఖరులోగా నివేదిక ఇచ్చే అవకాశం ఉంది.

ప్రస్తుత చెల్లింపులు ఇలా..

దేశీయ మద్యం తయారీ కంపెనీలు (డిస్టిలరీలు) టీఎస్‌బీసీఎల్‌కు విక్రయించే ధరలను బట్టి చీప్ లిక్కర్, మీడియం లిక్కర్, ప్రీమియం లిక్కర్‌గా నిర్ధారిస్తారు. ఇవి కాకుండా విదేశీ మద్యం అదనం. డిస్టిలరీలకు చీప్ లిక్కర్‌పై పెట్టెకు (12 పుల్ బాటిల్స్) రూ. 450 లోపు, మీడియం లిక్కర్‌కు రూ. 750, ప్రీమియం లిక్కర్‌కు రూ. 750 కన్నా ఎక్కువగా టీఎస్‌బీసీఎల్ చెల్లిస్తున్నది. ప్రీమియం (స్ట్రాంగ్) బీర్ల పెట్టెకు రూ 313.78, లేగర్ (లైట్) బీర్ల పెట్టెకు రూ. 289.22 చొప్పున చెల్లిస్తున్నది. చీప్ లిక్కర్‌కు, బీరుకు బేసిక్ మీద రూ 100, మీడియం, ప్రీమియం మద్యం మీద రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా చెల్లించాలని మద్యం కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆ మేరకు సామనుకూల నిర్ణయాలు తీసుకునే దిశగానే అడుగులు పడుతున్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.

అలైన్‌మెంట్ మార్పు ఎందుకోసం?

III తరువాయి...

అలైన్‌మెంట్ ఖరారుకు 12 మంది అధికారులతో కమిటీని వేశామని తెలిపిన మంత్రి పొంగులేటి.. అసలు అలైన్‌మెంట్‌ను మార్చాల్సిన అవసరమేమిటో మా త్రం వివరించలేదు. సాధారణంగా సాంకేతిక సమస్యలున్న చోట మార్పులు చేయ డం సహజం. అందుకు ప్రత్యేకంగా ఓ కమిటీ అవసరం లేదు. ఇందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖరారైన ఉత్తర భాగం అలైన్‌మెంట్ నిదర్శనం. కానీ ప్రభుత్వం దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో భారీ ఎత్తున మార్పులు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఆ విషయాన్ని సూటిగా చెప్పకుండా అధికారుల భుజం మీద పెట్టి తమ అలైన్‌మెంట్‌ను ఖరారు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే నిజమైతే.. ఈ భారీ మార్పులకు ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరిస్తుందా? అన్నది కీలకంగా మారింది. ఒకవేళ అంగీకరించకపోతూ కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.12,500 కోట్లను కోల్పోవాల్సి వస్తుందనేది సుస్పష్టం. ఈ విషయం తెలిసినా ప్రభుత్వం కమిటీ వేసిందంటే ప్రపంచ బ్యాంకు రుణం వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తున్నది.

ఆ ప్రజంటేషన్‌లోని మార్పుల కథేమిటో?

చాలాకాలంగా దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆ మేరకు క్షేత్రస్థాయిలో లీ అసోసియేట్స్ సర్వేలు చేపట్టి.. సంబంధిత గ్రామాల్లో గుర్తులు కూడా పెట్టింది. రాత్రి వేళల్లో డ్రోన్లతో సాంకేతిక సర్వేలు కూడా చేశారు. వాటన్నింటినీ క్రోడీకరించిన అధికారులు కొన్నిరోజుల కిందట పాత, కొత్త అలైన్‌మెంట్లతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా రూపొందించారు. దానినే ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ప్రదర్శించగా.. ఈ మార్పులపై ఏ ఒక్క అధికారి నోరు విప్పొద్దనే హుకుం జారీ అయినట్టు తెలిసింది. దీంతో అసలు ఆ ప్రజంటేషన్‌లో ఉన్న మార్పులు సూచించినదెవరు? ప్రభుత్వ పెద్దల ఆదేశం లేనిదే అధికారులు అలైన్‌మెంట్‌ను మార్చే సాహసం చేస్తారా? ముఖ్యంగా సీఎం ముందు మార్పులతో కూడిన అలైన్‌మెంట్‌ను ప్రదర్శించిన తర్వాత కొత్తగా చేసే మార్పులు ఏమిటి? అందుకు అధికారులతో కూడిన కమిటీ ఎందుకు? ఈ ప్రశ్నలకు ప్రభు త్వం సమాధానం చెప్పాల్సిన అవసరముందని పలువురు డిమాండ్ చేస్తున్నా రు. మరోవైపు ప్రభుత్వం అధికారులతో కమిటీ వేయడంతో ఇప్పటివరకు ఆందోళనలో ఉన్న గ్రామాల రైతుల్లో తీవ్ర చర్చ మొదలైంది. కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి అలైన్‌మెంట్ మార్పులను సూచిస్తుందా? అనేది కీలకమైన విషయం. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లోని రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకుంటారా? గ్రామసభలు నిర్వహిస్తారా? అనేది వేచిచూడాల్సి ఉంది. గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌పై రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాలేదు. అంటే ఇప్పుడు వాటిలో మార్పు జరిగితే రైతుల నుంచి భిన్నమైన స్పందన వస్తుందనేది సుస్పష్టం. అందుకే ఈ మార్పుల్లో రైతుల భాగస్వామ్యం ఉంటుందా? అనేది తేలాల్సి ఉంది.

స్పందన ఏది?

ప్రభుత్వ, కాంగ్రెస్ పెద్దల భూముల కోసం ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో మార్పునకు కుట్ర జరుగుతున్నదంటూ మూడు రోజులుగా 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురిస్తున్నది. రైతుల గోడును బయటి ప్రపంచానికి చేరవేస్తున్నది. కానీ ప్రభుత్వ పెద్దలు దేవుడెరుగు.. సంబంధిత శాఖ అధికారులైనా నోరెత్తితే ఒట్టు! వారిని సంప్రదించేందుకు ప్రయత్నించినా... 'మాకేం తెల్వదు మహాప్రభో!' అంటూ చేతులెత్తేస్తున్న పరిస్థితి. చిన్న వార్తలకే ఖండనలు పంపే సర్కారు యంత్రాంగం ట్రిపుల్ ఆర్ కథనాలపై ఎందుకు స్పందించడంలేదు? ప్రస్తుతం అధికార యంత్రాంగంలోనే కాదు.. ప్రజల్లోనూ ఇదే చర్చ జరుగుతున్నది.

రేవంత్‌కు రిపోర్ట్ చేయొద్దు

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టు ఆదేశం
- దర్యాప్తు పురోగతిపై సీఎంకు నివేదిక ఇవ్వొద్దు
- రేవంత్ జోక్యం చేసుకుంటే కోర్టును ఆశ్రయించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం సంభవించింది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముఖ్యమంత్రి, హోం మంత్రిగా కూడా ఉన్న ఆయనకు దర్యాప్తు అధికారులు ఈ కేసుకు సంబంధించిన వివరాలను నివేదించవద్దని స్పష్టంచేసింది. ఓటుకు నోటు కేసు విచారణను భోపాల్‌కు బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌లు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వైద్యనాథన్‌తో కూడిన ధర్మాసనం వాదనలు ఆలకించింది. అనంతరం కేసును భోపాల్‌కు బదిలీ చేయాల్సిన అవసరంలేదని పేర్కొన్నది. అలాగే, ఇప్పటివరకు ఉన్న ప్రాసిక్యూటర్ కేసు తదుపరి ట్రయల్‌ను కూడా కొనసాగిస్తారని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ జరుపాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అయితే, ఈ కేసులో కీలకంగా ఉండి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేసుకు సంబంధించిన పురోగతి, నివేదికలను ఇవ్వరాదని ఆదేశించింది. హోం మంత్రిగా కూడా ఆయనే ఉన్నందున రేవంత్‌కు ఏసీబీ రిపోర్ట్ చేయవద్దని ఆదేశించింది. ఏసీబీ డీజీపీ సీఎం/హోంమంత్రికి రిపోర్టు చేయవద్దని, ఒకవేళ చేసినట్టు పిటిషనర్ వద్ద ఆధారాలుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది.

నోరు జాగ్రత్త..

ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల పట్ల కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరిన క్షమాపణలను సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు స్పందిస్తూ కోర్టు తీర్పుల పట్ల విమర్శనాత్మకమైన అభిప్రాయం చెప్పే హక్కు ఎవరికైనా ఉంటుందని అన్నారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న నేతలు బహిరంగంగా వ్యాఖ్యలు చేసేముందు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ప్రస్తుత దశలో ఈ కేసులో జోక్యం చేసుకోలేమని అంటూ విచారణను సుప్రీంకోర్టు ముగించింది. శాసన, న్యాయ, పరిపాలనా వ్యవస్థలు తమ విధులను రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

హైడ్రాకు సూపర్ పవర్స్

- చట్టబద్ధత, సర్వాధికారాల కల్పన
- 3 యూనివర్సిటీలకు పేర్లు మార్పు
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల అంచనాలు పెంపు
- ఖరీఫ్ నుంచే సన్నవడ్లకు బోనస్
- కొనుగోళ్లకు రూ.2,500 కోట్ల అదనపు బడ్జెట్
- జనవరి నుంచే రేషన్‌కార్డు హోల్డర్లకు సన్న బియ్యం పంపిణీ
- క్యాబినెట్ సమావేశంలో నిర్ణయాలు

మంత్రి మండలి సమావేశ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని శాఖలకున్న అధికారాలను హైడ్రాకు కట్టబెట్టింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సర్కారు హైడ్రాకు సర్వాధికారాలు కట్టబెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. అనంతరం వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాకు వివరించారు.

హైడ్రాకు విస్తృత అధికారాలు

హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలపై హైడ్రా నిర్ణయం తీసుకోనున్నదని మంత్రులు తెలిపారు. ఇందుకోసం ఓఆర్ఆర్ లోపలి పట్టణ స్థానిక సంస్థల్లోని అన్ని శాఖలు, విభాగాలకు ఉన్న అధికారాలు, స్వేచ్ఛలను హైడ్రాకు కట్టబెడుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రులు తెలిపారు. ఇందులో పనిచేసేందుకు వివిధ విభాగాల నుంచి 169 మంది అధికారులు, 946 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను డిప్యూటేషన్ మీద బదిలీ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

మూడు వర్సిటీలకు పేర్లు మార్పు

రాష్ట్రంలోని మూడు యూనివర్సిటీలకు పేర్లను మార్చుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. కోఠిలోని మహిళా యూనివర్సిటీని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్శిటీగా మార్చినట్టు తెలిపారు. కొత్తగా ఏర్పాటుచేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టారు.

రెండేండ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి

శ్రీశైలం ఎడమకాలువ టన్నెల్ పనులకు సంబంధించిన అంచనాలను రూ.4,637 కోట్లకు సవరించినట్టు మంత్రులు తెలిపారు. 2027 సెప్టెంబర్ నాటికి టన్నెల్ పనులతో పాటు డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పెండింగ్ పనులను పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించామని చెప్పారు. టన్నెల్ పూర్తయితే శ్రీశైలం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజ్ నుంచి కృష్ణా జలాలను తీసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రతి నెలా 400 మీటర్ల చొప్పున రెండేండ్లలో టన్నెల్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

ఖరీఫ్ నుంచే సన్నవడ్లకు బోనస్

ఈ ఏడాది ఖరీఫ్ నుంచే సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రులు తెలిపారు. ఇందుకోసం పంట కొనుగోళ్ల బడ్జెట్‌కు అదనంగా రూ.2,500 కోట్లు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. కొత్త, పాత రేషన్‌కార్డులకు కలిపి వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌పై కమిటీ

ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారు చేసేందుకు 12 మంది అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రులు తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుందని, ఇందులో రెవెన్యూ, మున్సిపల్ శాఖల కార్యదర్శులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

క్యాబినెట్ ఇతర నిర్ణయాలు..

- ప్రస్తుతం అమల్లో ఉన్న పోలీస్ ఆరోగ్య భద్రత పథకాన్ని ఎస్పీఎల్ కింద వర్తింపజేయాలని నిర్ణయించింది.